## 6

# "యెహోవా మందిర పర్వతము"

*"అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును ..." (యెషయా 2:2).*

దేవుని వ్యక్తిత్వం, గుణం, చిత్తం సరిగ్గా తెలుసుకోడం బైబిల్ అనే ఆయన వాక్యంనుంచి ఎరుగవచ్చు. ఏదియెలాగున్నా, దేవుని గూర్చిన ఈ సత్యం ముఖ్యమైన సాధారణ సత్యాలను నిర్లక్ష్యం చేసేలా చేయకూడదు. లోకం, ప్రకృతి అనే మరొక గ్రంథాన్ని చదవడం ద్వారా – దేవుని గూర్చి మనం గ్రహించుకోవచ్చు.

అందమైన వస్తువులను ప్రేమిస్తాడని మన చుట్టునున్న లోకాన్ని చూస్తే దేవుని స్వభావంలోని ఒక లక్షణం మనకు తెలుస్తుంది. రంగు రంగుల నెమలిలో మనకు అది కన్పిస్తుంది. గంభీరమైన మంచుతో కప్పబడిన పర్వతాలు, వాటి దిగువ భాగంలో ఉన్న మనోహరమైన పచ్చదనం, దాని పై భాగమందు ఆవరించియున్న నీలి వర్ణపు మేఘాల్లో అది కన్పిస్తుంది. నల్లటి వెల్వెట్ దుప్పటిపై పొదగబడిన రత్నాలవలె ఆకాశ విశాలంలోని నక్షత్రాల మెరుపులో అది గోచరిస్తుంది. భూమిమీదనున్న – మల్లి, గులాబి, చేమంతి, పారిజాతములవంటి వివిధ వర్ణాలుగల పుష్పాలలోను, ఆయారకములైన శృంగార ఉద్యాన వనములలోను, కొండలు, లోయలు, మైదానాలలోను అది ప్రదర్శింపబడుతుంది. మన లోకానికి ఉన్న పలు విధములైన లక్షణాలను గూర్చి ఆలోచించినట్లయితే, అందమైనవాటిని రమ్యమైనవాటిని దేవుడు అభినందిస్తాడనే నిర్ణయానికి రానివాడెవడుంటాడు?

దేవునికున్న యిలాటి గుణలక్షణం భౌతిక ప్రపంచంలో మాత్రమే కాదు, ఆత్మ సంబంధమైన పరిధిలో సహితం ఎక్కువగా విదితమైయుంది. దేవుని యొక్క నిరంతర కృపాకార్యము అద్వితీయమైన ఆత్మలను సృజించడమైయున్నట్టు మన గమనికనుండియు లేఖనములనుండియు నేర్చుకొంటున్నాము. సుందరమైన వాటిని దేవుడు ప్రేమిస్తాడనేది వాస్తవం. అంతకంటె అధికమైన వాస్తవమేమంటే, దేవుడు అందమైన జనులను ప్రేమిస్తాడు. దేవుడు పాపిని ప్రేమిస్తాడు. అయితే, "వానిని తనగానే ఉండనీయ్యనంతగా

ఆయన వానిని ప్రేమిస్తాడని" ఒక వ్యక్తి అన్నాడు. తన కనికరముయొక్క ఐశ్వర్యమందు, దేవుడు క్రీస్తు ద్వారా పాపిని క్రీస్తుయేసువంటి ఆకర్షణీయమైన వ్యక్తినిగా మరల సృజిస్తాడు.

దేవుని యొక్క ఈ గుణాతిశయపు వెలుగులో – దేవుని ఇశ్రాయేలు – లేక సంఘము యొక్క భవిష్యత్తు తెలుపబడింది. ప్రవచనమందు పరిశుద్ధాత్మ సంఘమును – సాటిలేని సౌందర్య రాశిగాను, మహిమతో అలంకరింపబడిన యెహోవా మందిరంగాను చిత్రించాడు (యెషయా 2:2–4). ఈ రూపచిత్రంలో, సంఘము చల్లని రాళ్ల భవనం కాక, తనవైపు చూచే జన సమూహాలను ఆకర్షించే సజీవ పర్వతంగాను చిత్రీకరింప బడింది.

యెషయాలోని లేఖన భాగం సంఘానికి చెందింది కాదు, బబులోను చెరనుండి తిరిగి వచ్చిన పిమ్మట యెరూషలేము యొక్క పునర్నిర్మాణానికి చెందినదని వాదింపవచ్చు. ఒకవేళ ఆ ప్రవచనానికి ద్వంద్వ భావం కూడా ఉండియుండవచ్చు: ఒకటి "ఆ నాటికి సంబంధించినది" – చెరానంతరం జరిగిన భౌతికమైన యెరూషలేము పునర్నిర్మాణం – మరియు దూరపు దినం కొరకు – పెంతెకొస్తు దినాన సంఘ స్థాపనను గూర్చిన ప్రవచనమైయుండవచ్చు. ఏదియెలాగున్నా, రెండవ వచనంలోని "అంత్య దినములు" అనే యెషయా గ్రంథ ప్రయోగం సంఘ స్థాపనకు గాక మరి దేనికిని వర్తించదు. జెరుబ్బాబెలు, ఎజ్రా, నెహెమ్యాల కాలంలో యెరూషలేము యొక్క భౌతిక పునర్నిర్మాణ కార్యక్రమానికి దీన్ని వర్తింపజేయడం – పాత క్రొత్త నిబంధనలలోని సంఘమును గూర్చిన సాధారణ ఉపదేశపు వెలుగులో – ప్రతిఘటన లేనిదై ఉంటుంది. "అంత్య దినములలో" అనే పద ప్రయోగం క్రైస్తవ యుగారంభానికి సంబంధించిన ప్రవచనాన్ని సూచించునదై ఉంది. సంఘ ఆరంభమనే సంభవం అక్కడ జరుగనై యున్నందున, రానున్న తరాలవారు యెరూషలేముతట్టు చూస్తారని ఈ ప్రవచనం అంటుంది. ప్రభువైన యేసు పునరుత్థానుడైన తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన, పరిశుద్ధాత్మ యొక్క కుమ్మరింపుతోను, సంఘ స్థాపనతోను, "అంత్యదినములనే" క్రైస్తవ యుగం ఆరంభమైనట్టు పేతురు వివరించాడు (అపొ. 2:16–21).

యెషయాలోని ఈ లేఖన భాగము (మీకా 4:1–3లో కూడా చెప్పబడింది) ప్రవచనం అనే దుర్భిణీ ద్వారా సంఘం యొక్క ఔన్నత్యం, వైభవమనే వాటిని చూస్తాం. ఈ ప్రవచనం యాదృచ్ఛికంగా సంఘమనే రాజ్యం యొక్క గౌరవపదమైన రాక కొరకైన ప్రవచనంగా దీన్ని మనం గుర్తించుదాం. ఈ ప్రవచనంలో నిక్షిప్తం చేయబడిన ప్రతి గుణ లక్షణాన్ని విదితమైన క్రొత్త నిబంధన ఉపదేశానికి మనం జతపరచుదాం.

సంఘం యొక్క సౌందర్యాన్ని యెషయా ఎలా వర్ణించాడు?

## దానికున్న మంచి పేరు ద్వారా

మొదటిగా, సంఘము యొక్క సౌందర్యాన్ని దానికిగల విస్తృత ఖ్యాతి ద్వారా యెషయా చిత్రించాడు. "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును" అని

అతడు వ్రాశాడు (యెషయా 2:2). సంఘము యొక్క మహోనీయమైన లక్షణాలను భూలోకమందలి జనులందరు గుర్తిస్తారు. దానిపట్ల ఆకర్షితులౌతారు.

సంఘము యెరూషలేము కొండపై ఉన్నటువంటి యెహోవా మందిరమైయున్నట్టు అలంకారోక్తిగా చెప్పబడింది. ఆ మందిరం యొక్క ప్రకాశము సమస్త జనముల యొక్క అభిమానాన్ని చూరగొంటుంది. మరియు వారు ఆ కొండ వద్దకు వచ్చి దాన్ని అధిరోహిస్తారు. దేవుని ఉద్దేశాలతో దానికున్న సంబంధాన్ని బట్టి, లోకంలో ఉన్న కొండలన్నిటికంటే అది ఎత్తుగా పైకెత్తబడుతుందని యెషయా అన్నాడు.

సంఘము లోకవ్యాప్తమైయుండే అయిస్కాంతమైయున్నట్టు క్రొత్త నిబంధన బయలుపరుస్తోంది. రాజ్యమును గూర్చి ఆయన చెప్పినప్పుడు సంఘం యొక్క సార్వత్రికమైన వర్తింపును గూర్చి ప్రభువైన యేసు ముందుగా సూచించాడు. "అనేకులు తూర్పునుండియు పడమటనుండియు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను, పరలోకరాజ్యమందు కూర్చుందురు ..." (మత్తయి 8:11).

---

**సంఘము యెరూషలేము కొండమీద ఉంచబడిన యెహోవా మందిరముగా అలంకార యుక్తంగా చిత్రించ బడింది. దాని కాంతి లోకమందలి సమస్త జనులయొక్క అభిమానాన్ని చూరగొంటుంది, మరియు వారు ఆ కొండ వద్దకు వచ్చి దానినధిరోహిస్తారు.**

---

యెరూషలేము నాశనాన్ని కేంద్రంగా చేసికొనిన తన ఒలీవ కొండమీద చర్చలో, సవిస్తరంగా సువార్త ప్రకటింపబడుతుందన్న సంగతిని ప్రభువు వాగ్దానం చేశాడు: "మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింప బడును ..." (మత్తయి 24:14). ఆయన మృతులలోనుండి లేపబడిన పిమ్మట, సువార్త లోకమంతట ప్రకటింపబడాలని ప్రభువైన యేసు ఆజ్ఞాపించాడు: "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15). పెంతెకొస్తు దినమున తొలిగా సువార్త ప్రకటించినప్పుడు, "ఆకాశము క్రిందనుండు ప్రతి జనములోనుండి వచ్చిన భక్తిగల యూదులు" విన్నారు, విధేయులైనట్టున్నారు కూడా (అపొ. 2:5, 9–11). "సకల జనులకు" సంబంధించిన ఆదేశం యివ్వబడిన ముప్పై సంవత్సరాల తరువాత, పౌలు కొలొస్సయులకు యిలా వ్రాశాడు, "పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశముక్రింద ఉన్న సమస్తసృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు నిరీక్షణనుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండినయెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని" (కొలస్సీ. 1:23).

ప్రకటన 5:9, 10లో దేవుని సింహాసనం యెదుట క్రొత్త పాట వినిపించింది. గొర్రెపిల్ల యొక్క రక్తంచేత ప్రతి జనములోనుండియు, ప్రతి వంశములోనుండియు విమోచింపబడిన జనులను బట్టి పాడిన ఉత్సాహ గీతమది. పరలోకమందున పెద్దలు

ప్రభువును యిలా స్తుతించారు – “నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు, నీవు వధింపబడినవాడవై నీ రక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవుని కొరకు మనుష్యులను కొని, మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితిని; ...” మరో విధంగా చెప్పాలంటే, క్రైస్తవ యుగంలో, లోకమందంతట ఉన్న జనులు సువార్తచేతను సంఘముచేతను నమ్మునట్టు ప్రేరేపించబడతారు.

కొన్ని సంవత్సరాల క్రిందట, హవ్వార్డ్ హోర్టన్ అనే మిషినెరీ హార్డింగ్ యూనివర్సిటీని సందర్శించడం మాకు ఆనందం కలిగించింది. అతడు ఉపయోగించిన మాటల్లో ఆలోచనా పూర్వకమైన ఉదాహరణ నాకు యింకా జ్ఞాపకం ఉంది: అతడు అనేక దేశాలలో మిషినెరీగా పని చేశాడు. తాను వెళ్లిన ప్రతి స్థలంలో జనులకు దేవునియందలి విశ్వాసం న్యాయసమ్మతంగా ఉన్నట్టు అతడు కనుగొన్నాడు. దాన్ని అతడు లెక్కను నేర్పించడంతో పోల్చాడు. ప్రపంచమంతటిలోని పిల్లలు – రెండు రెండు కలిపితే నాలుగౌతుందని నేర్చుకున్నప్పుడు, వారి మనస్సులకు తడుతుంది, “అది రైటు. అది నిజం” అని అదే విధంగా, సర్వశక్తిగల దేవుడు లోకాన్ని సృజించాడనియు, ఆయన నరుని ప్రేమిస్తాడనియు, మనిషిని రక్షింపగోరుతున్నాడనియు జనులు బోధింప బడినప్పుడు, ఆ విశ్వాసాన్ని వారి మనస్సులో ఉన్న ఏదో యొకటి అంగీకరిస్తుంది. “అది రైటు. అది తప్పక సత్యం” అని వారు చెప్తూతారు.

అసాధారణమైన ఈ సంభవం సంఘం విషయంలో సత్యమౌతుంది. సంఘము యొక్క సుగుణ శీలానికి దేవుని వాక్యం యిచ్చే సాక్ష్యానికి తోడు, మన హృదయాల్లో కూడ అలాటి తీర్పు మనకుంటుంది. లోకంలో ప్రతిచోట జనులు క్రొత్త నిబంధన సంఘాన్ని గూర్చి బోధింపబడుతున్నారు. “అది రైటయ్యే ఉండాలి” అని వారి మనస్సులో స్థిరంగా ప్రత్యుత్తరం కలుగుతుంది. సంఘం పట్ల ప్రజలకుండే సంబంధం అసమానమై ఉంటుంది; దాన్ని గమనించడం ఆశ్చర్యంగా ఉంటుంది. సంఘం ఏమైయుందో ప్రజలు అర్థం చేసికొన్నప్పుడు, వెలుపటనున్న వెలుగుకు వేసవి పురుగులు కాంతిచుట్టూ ఎగిరి వచ్చినట్టు, వారు దాని వద్దకు వస్తారు. లోకంలో ఉన్న ప్రజలందరూ క్రొత్త నిబంధన సంఘాన్ని మెచ్చుకుంటారు.

ఈ చిన్న ఆలోచనతో, సంఘము యొక్క ప్రఖ్యాతిని అర్థం చేసికొనడం సులభం. ప్రభువైన యేసు రక్తంచే జనులు రక్షింపబడి, నిత్య జీవం ప్రసాదింపబడినప్పుడు, వారు క్రీస్తు యేసు యొక్క నామాన్ని ధరించినవారై పరలోకంలోని నిత్య మహిమకు వారు ఎదురు చూస్తూ ఉంటారు. వారు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. రక్షకుని గూర్చి ఎరుగని వారికి రక్షణ సందేశాన్ని అందించడానికి వారు వేచి ఉంటారు. ఆయన సంఘమైయుండడం నిజంగా అద్భుతమే! సమస్త వంశాలు, జనములు, గోత్రాలు భూమిమీదనున్న కుటుంబాలన్నీ దాని విలువ తెలిసికొని ప్రవాహం వచ్చినట్టు దానిలోనికి వస్తుంటే ఆశ్చర్యం లేదు.

## దాని ప్రకటన ద్వారా

రెండవది, సంఘము యొక్క మహిమ దాని ప్రకటన ద్వారా గోచరిస్తుందని యెషయా తెలియజేశాడు. అతడు యిలా వ్రాశాడు,

> ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలువెళ్లును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి – యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు (యెషయా 2:3).

యెరూషలేములోని యెహోవా మందిరములోనుండి యెహోవా వాక్కు, సువార్త, బయలుదేరనైయున్న ఒక దినాన్ని పరిశుద్ధాత్మ దివ్య దృష్టితో తిలకించాడు.

యెహోవా ధర్మశాస్త్రాన్ని పొందడానికిగాను జనులు యెరూషలేమునందున్న యెహోవా మందిరానికి వస్తారు. ఆ చట్టాన్ననుసరించి తాము జీవించవలసి ఉంటుందని ఎరిగి వారు అక్కడికి వస్తారు. మరియు ఆయన త్రోవలయందు నడుచు కొనడానికై వారు యెరూషలేమునుండి బయలుదేరుతారు. ''అంత్య దినములు'' ఆరంభ మయ్యాయంటే, నూతన యుగానికి ఆరంభ స్థలముగా ప్రతి ఒక్కరు చూస్తారు గనుక యెరూషలేముపై ప్రాముఖ్యత ఉంచబడింది: "ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలువెళ్ళును ..."

క్రొత్త నిబంధనలో సంఘ (లేక క్రైస్తవ) యుగారంభ స్థలముగా ప్రభువైన యేసు యెరూషలేమును పేర్కొన్నాడు. తన అపొస్తలులకు ఆజ్ఞాపించుచూ ఆయన యిలా అన్నాడు,

> –క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు **యెరూషలేము మొదలుకొని** సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు **పట్టణములో నిలిచి యుండుడని** వారితో చెప్పెను (లూకా 24:46–49; ఒత్తి పలికింది నాది).

అలాగే, ఆయన ఆరోహణానికి ముందు, పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చునట్లు, వారు యెరూషలేములో నిలిచియుండాలని ప్రభువు తన శిష్యులకు ఆజ్ఞాపించాడు. ఇందును గూర్చి లూకా యిలా వ్రాశాడు: "ఆయన వారిని కలసికొని యీలాగు ఆజ్ఞాపించెను – మీరు యెరూషలేమునుండి వెళ్లక, నావలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి" (అపొ. 1:4). పది దినములు గడిచిన పిమ్మట పరలోకంనుండి పరిశుద్ధాత్మ అపొస్తలుల మీదికి, పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందేలా కుమ్మరింపబడ్డాడు. ఆ విధంగా "అంత్య దినములు" ఆరంభమయ్యాయి (అపొ. 2:1–4, 16–21). అలా కుమ్మరింపబడిన దినాన పేతురు పునరుత్థానుడైన క్రీస్తు యొక్క సువార్తను ప్రకటించినప్పుడు, రోమా ప్రపంచంలోని ఆయా దేశాలకు సంబంధించిన మూడువేలమంది ఆ వర్తమానాన్ని

అంగీకరించి, విశ్వసించి, మారుమనస్సు పొంది, వారి పాపక్షమాపణ కొరకు బాప్తిస్మం పొందారు (అపో. 2:41, 47). అపొస్తలుల సువార్త ప్రకటన ద్వారా యెరూషలేమునుండి యెహోవా వాక్కు బయలుదేరింది. రోమా సామ్రాజ్యమంతటినుండి వచ్చిన ప్రజలు ఆయన త్రోవలయందు నడువనారంభించారు.

ఈ లోకంలో నిజంగా విలువైనదేది? అది ధన సంపాదనా? అది విద్యాభ్యాసమా? అది లోకవ్యాప్తమైన అంతస్థును సంపాదించుకొనడమా? జీవితానికి అత్యున్నతమైన గురిగా వీటిలో మనం దేనిని సూచించకపోవచ్చు. ఎందుకంటే ఈ సాధనలలో దేనివలనను వంద సంవత్సరాల తరువాత ఏ మేలు పొందలేము అనే కారణంవలననే. వాటికి పరిమితియైన విలువ మాత్రమే ఉంది; వాటి విలువ కాలముతో ముడివేయబడి ఉంది. ఏదియెలాగున్నా, దేవుని వాక్యానికి మన విధేయత కాలాన్ని అధిగమించి నిత్యత్వంలోనికి మనలను తీసికొని వెళ్లుతుంది. "బాగా చేశావు" అంటూ ప్రభువు పలికే నిత్య ఆహ్వానాన్ని అది పొందుతుంది (1 యోహాను 2:16). దేవుని వాక్యాన్ని బోధించేవారు బోధింపబడేవారికి అత్యధికమైన ఉపకారం చేసేవారైయుంటారు. ఎందుకంటే వీరు వారికి నిత్యజీవాన్ని పొందే అవకాశాన్ని ఉపదేశించినవారై ఉంటారు.

దేవుని వాక్యాన్ని ప్రకటించడం ఎల్లప్పుడు సంఘము యొక్క పనియై ఉంటుంది. క్రైస్తవులు తమ ప్రభువువలె ఉపకారం చేసేవారై, కనికరం కలిగినవారైయుండాలి; అయితే మన వద్దనుండియు, మన ద్వారాను సువార్త బయలువెళ్లేలా, ఆయనవలె మనమును స్పష్టముగా అగుపడునట్లు చేయాలి. సంఘము "సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నట్టు" పౌలు తెలియజేశాడు (1 తిమోతి 3:15). చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచినవాని "గుణాతిశయములను" ప్రచురించ వలసినదిగా విమోచింపబడినవారిని పేతురు ప్రేరేపించాడు (1 పేతురు 2:9). మానవ సముద్రంలోనికి పరిశోధన వెలుగును పంపే లైట్ హౌస్‌తో సంఘాన్ని పోల్చవచ్చు. సువార్త ప్రకటన ద్వారాను, వ్యక్తిగత ఉపదేశం ద్వారాను, ముద్రింపబడిన సందేశం ద్వారాను, క్రీస్తు ప్రభువు కొరకు మనం అనుదినం జీవించే జీవితం ద్వారాను లోకంలోని ప్రజలకు మన వెలుగును పంపుతాం. ఆ వర్తమానమే వారి ఆత్మలను రక్షించగలుగుతోంది (రోమా 1:16).

తన పనినిబట్టి సంఘము గౌరవనీయమైనదై ఉన్నట్టు యెషయా తెలిపాడు. భూలోకమందలి ప్రజలందరికి నిత్య సువార్తను ప్రకటించే పనికి తన్ను తాను సమర్పించుకున్న ఏకైక జనం సంఘం. గొప్పగా చేసే, సమాధానపరచే ప్రభావం సువార్త ప్రకటనకు ఉన్నందున, పౌలు యెషయాను కోట్ చేసి యిలా అన్నాడు: "ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" (రోమా 10:15బి; యెషయా 52:7 చూడు). ఆ మాటలను మనం తీసికొని, "లోకమంతటికి దేవుని వాక్యాన్ని పంపే సంఘము యొక్క పని ఎంత ఉన్నతమైనది" అని మనం చెప్పవచ్చు. సంఘము యొక్క గణనీయమైన ఈ ప్రత్యేక లక్షణాన్ని ఎవరు పోగొట్టుకో గలరు?

## దాని సమాధానాభివృద్ధి ద్వారా

మూడవది, దాని సమాధానాభివృద్ధిని బట్టి సంఘము సుందరమైనదై ఉంది. ఈ విషయమై యెషయా యిలా అన్నాడు,

> ఆయన మధ్యవర్తియై అన్య జనులకు న్యాయము తీర్చును అనేక జనములకు తీర్పు తీర్చును. వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను తమ యీటెలను మచ్చుకత్తులుగాను సాగగొట్టుదురు జనముమీదికి జనము ఖడ్గమెత్తక యుండును యుద్ధముచేయ నేర్చుకొనుట ఇక మానివేయును (యెషయా 2:4).

మరోవిధంగా చెప్పాలంటే, సంఘమందు భూమిమీద సమాధానము నెలకొనును.

వారి జీవితాలపై ఉండే దేవుని ప్రభావంవలన భూమిమీదనున్న సమస్త దేశముల వాసులు కలసి సమాధానంగా నివసించే యుగాన్ని యెషయా ప్రవచనంలో చూచాడు. వారు ప్రవేశించే సంఘమనే దేవుని రాజ్యం సమాధానానికిని నెమ్మదికేగాని, తగవులకు సంఘర్షణలకు చోటు కానేరదు. కలహానికి, పొందికలేమికి గురియై యుద్ధం చేసికొనే జనంగా వారు విభాగింపబడరు, కాని ఆత్మద్వారా ఒకే సమాజంగా వారు జోడింప బడతారు. యుద్ధానికి ఉపయోగించే ఆయుధాలను, సమాధానపు సమాజంలో ప్రయోజనకరమగు పరికరాలుగా వారు మార్చుకుంటారు.

క్రొత్త నిబంధనను చదవడంలో, "సమాధానం" అనే పదం విరివిగా ఉపయోగింప బడినట్టు ఎవరును చూడకపోరు. దేవుడు "సమాధానకర్తయగు దేవుడు" (రోమా 15:33). ప్రభువైన యేసు సమాధానాన్ని తన విధానంలో కొనివచ్చుటకే అవతరించాడు. ఆయన జనన సమయాన దేవదూతలు యిలా పాడారు: "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగును గాక" (లూకా 2:14). సువార్తయు "సమాధాన సువార్తయే" (ఎఫెసీ. 6:15). మరపురాని ధన్యతతో ప్రభువైన యేసు తన శిష్యులను సమాధానపరచువారినిగా పంపుతాడు: "సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు" (మత్తయి 5:9). అపొస్తలులతో ఆయన చివరి మాటలు సమాధానంతో నింపబడ్డాయి: "శాంతి (సమాధానము) మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే (సమాధానమునే) మీ కనుగ్రహించుచున్నాను; లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుటలేదు; మీ హృదయమును కలవరపడనియ్యకుడి; వెరవనియ్యకుడి" (యోహాను 14:27).

సంఘమును గూర్చి పరిశుద్ధాత్మ యిచ్చిన తొలి చిత్రం స్థానికంగా బాప్తిస్మం పొందిన విశ్వాసుల సమాజమైయుంది. వారు అనేక దేశాలనుండి వచ్చినవారైనా క్రీస్తు ద్వారా ఏకముగా వారు నివసించారు: "విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి" (అపొ. 2:44). "మరియు వారేకమనస్కులై" అనుదినము కొనసాగారు (అపొ. 2:46).

మన మనస్సులు గ్రహించగల రమ్యమైన గుణలక్షణాల్లో ఒకటి – దేవునికి మనిషికి మధ్యను, మనిషికి మనిషికి మధ్యను – నిజమైన సమాధానం – అది మన సొంత హృదయాల్లో ఉంటుంది. దాన్ని తీసివేయగలిగేది ఏదీ ఉండదు. మన లోకం కలవరంతో

కూడిన స్థలమైయుంది – భయంచేతను, పరపక్ష ద్వేషం, కలహం, అసూయ, భారభరితమైన హృదయంతో నిండినదైయుంది. ఈలాటి లోకంలో సమాధానం ఉండగలదా? అవును. అలా ఉండే స్థలం సంఘమే అయ్యున్నట్టు క్రొత్త నిబంధన అంటుంది.

ప్రత్యేకమైన ఓడ తయారీని కనిపెట్టాలనుకున్న ఒకని గూర్చి నేను చదివాను. సముద్రంలో తుఫాను కెరటాలతో కొట్టబడినా దాని అంతర్భాగంలోని గదులు మాత్రం ఎల్లప్పుడు పరిపూర్ణమైన నెమ్మది కలిగియుండేలాంటి ఓడను అతడు తయారు చేయాలనుకున్నాడు. తీర్చిదిద్దిన ఆ గదిలో కలవర పరిస్థితుల్లో కూడా స్థిరమైన స్థలం ఉండాలి. అతని ఆశయానికి ప్రతిఫలం ఏం కలిగిందో నాకు తెలియదుగాని, కలవరంతో ఎల్లప్పుడు కొట్టబడుతూ ఉండే దాని మధ్య నెమ్మదిగా ఉండే స్థలం అనేదానికి సంఘము పరిపూర్ణమైన చిత్రమైయుంది.

క్రీస్తు శరీరమైన సంఘంలో మాత్రమే మనం నిజమైన సమాధానాన్ని కనుగొనగలం. నిజమైన సమాధానం కావాలంటే, మన పాపములనుండి రక్షింపబడినవారమై మొదట దేవునితో సమాధానం కలవారమైయుండాలి (రోమా 5:1); తరువాత మనం యితరులతో సమాధానం కోరవలసిన వారమైయున్నాం (రోమా 12:18; మత్తయి 5:23–25); దానికి ఫలితంగా, మన కలవరాలను దేవుని వద్దకు కొనివస్తూ ఉండగా, మన అంతరంగంలో శాంతి (సమాధానం) మనకు ప్రసాదింపబడుతుంది (ఫిలిప్పీ. 4:6, 7). ఈ విధమైన సమాధానము క్రీస్తు ద్వారానే కలుగుతుంది. సమాధానమనేది ఆత్మ సంబంధమైనది, – అది కేవలం మానసిక సంబంధమైనదే గాక అనుభవంతో కూడినదియునైయున్నది – ఇంద్రియ శాస్త్ర సంబంధమైనదనే మాటలతో యెషయా చిత్రించడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు.

## ముగింపు

సంఘం రక్తంతో కొనబడిన జనుల కూటమి. అది దేవుని మహిమ మరియు జ్ఞానములతో ప్రకాశిస్తుంది. అది యితర పర్వతములకంటె ఎత్తుగా పర్వత రాజముగా ఎత్తబడింది. సమస్త జనములు దాని ఔన్నత్య స్థితిని చూచి, ప్రవాహంలా దానిలోనికి వస్తారు. దానికున్న ప్రఖ్యాతియందును, అది వృద్ధి కలిగించే శాంతి (సమాధానమందును) యందును దాని సౌందర్యం గోచరిస్తుంది. అర్థసహితమైన పని భూమిమీద దానికుంది. యెహోవా వాక్కును అది లోకమంతటికి పంపుతుంది. దేవుడు తన సమాధానాన్ని దానిలో ఉంచి, లోక సంబంధమైన ప్రతి సాహస కృత్యంకంటెను ఉన్నతంగా దానిని పైకెత్తాడు.

సంఘం యొక్క నిజమైన విలువను గుర్తించి నీవు దానిచే ఆకర్షింపబడ్డావా? నీవు దానిలో ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నావా? “యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు వెళ్లుదము రండి, అక్కడ ఆయన తన మార్గముల విషయమే బోధించును మనము ఆయన త్రోవలయందు నడుచుకొందము” అని నీ వెప్పుడైనా నీ

హృదయంలో అనుకున్నావా? ఇప్పుడు నీవు ఆరంభించదలచుకొంటే ఫరవాలేదు. నీవు దేవుని చట్టాన్ని ఎరిగి, క్రీస్తు శరీరంలో ప్రవేశింపవచ్చు. ఆయన త్రోవలయందు నడుస్తూ, ఆయన ప్రసాదించే సమాధానాన్ని నీవు ఎరుగవచ్చు (పొందవచ్చు).

జీవితమనే క్యాలండరుకు: నిన్న, నేడు, రేపు అనే మూడు రోజులు మాత్రమే ఉన్నాయి. నిన్న గడిపివేయబడింది గనుక చినిగిపోయిన కోటువలెనో, లేక పాత వార్తా పత్రికవలెనో తీసి పడవేయాలి. రేపు అనేది వాగ్దానం మాత్రమే, జరుగనైయున్న విషయాలతో కూడిన కల మాత్రమే, ఏమి అవ్వడానికి అవకాశముందో అది సూచింప బడింది. నీ క్యాలండరులో నీవు పని చేయగల దినం నేడే. నిన్నటినుండి మనం నేర్చుకోవచ్చు, రేపటి కొరకు ఎదురు చూడవచ్చు, అయితే ఏ చర్య తీసికోవాలన్నా ఉన్నది నేడే. పౌలు యిలా వ్రాశాడు: "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింథీ. 6:2). విశ్వాసము (యోహాను 8:24), మారుమనస్సు (అపొ. 17:30, 31), ప్రభువైన యేసును ఒప్పుకొనడం (రోమా 10:10), మరియు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడం ద్వారా (రోమా 6:3), నేడు యెహోవా మందిరంలో ప్రవేశిస్తారు (1 తిమోతి 3:15). అది అయ్యున్నట్టే సంఘమును దివ్యమైన శరీరంగా మనం గుర్తిస్తున్నామా?

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. దేవుడు మనకనుగ్రహించిన రెండు గ్రంథము లేవి? దానిలో ప్రతి ఒక్క దానినుండి మనం ఎలా నేర్చుకుంటామో వర్ణించుము.
2. దేవుడు పాపిని ఎలా ప్రేమించగలడు అదే సమయంలో అతడు మార్చు కోవాలని ఆయన ఎలా కోరుతున్నాడు?
3. యెషయా 2:2-4 ద్వంద్వ ప్రవచనమని చెప్పినప్పుడు దాని భావమేమి?
4. ప్రజలందరికి సంఘం ఎలా ఆకర్షణీయమైనదో వర్ణించుము.
5. సంఘమునకు సార్వత్రికమైన ఆకర్షణ ఉన్నట్టు ఏ లేఖనాలతో నీవు రుజువు చేస్తావు?
6. సంఘము యొక్క ఆరంభ స్థలము యెరూషలేమైయున్నట్టు ప్రభువు సూచించినట్టు లేఖనాలను సూచించుము.
7. ప్రభువు యొక్క త్రోవల్లో నేడు ఒకడు ఎలా నడువగలడు?
8. లోకంలో నిజంగా విలువైయున్నదేమి?
9. తన సంఘానికి ప్రభువు ప్రసాదించిన నిజమైన పనిని చర్చించుము.
10. నిజమైన సమాధానం తేబడేది ఎలాగు?
11. సంఘము సమాధాన రాజ్యమైయున్నట్టు యెషయా ఎందుకు చిత్రించాడు?
12. నిజమైన సమాధానాన్ని ఎక్కడ కనుగొనగలం?
13. నేడు సంఘాన్ని కనుగొనడానికి ఒకడు ఎక్కడికి వెళ్లగలడు?